క్లుప్తంగా

పేదలకు వస్త్రాల పంపిణీ

సంతకవిటి: మండలంలోని మిర్తివలస గ్రామంలో నిరుపేదలకు శనివారం వస్త్రాల పంపిణీ చేశారు. పొన్నాడ చిన్నవాడు వర్ధంతి సందర్భంగా పొన్నాడ అప్పలనరసమ్మ–చిన్నవాడు సేవాసంస్థ అధ్యక్షుడు పొన్నాడ వరహానరసింహరావు ఆధ్వర్యంలో సర్పంచ్ రాజాపు భూపతి, ఎంపీటీసీ రాజాపు రమణల చేతుల మీదుగా వీటిని అందజేశారు.

ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం



మాట్లాడుతున్న జెడ్పీ వైస్‌చైర్మన్ జగన్మోహనరావు

సంతకవిటి: స్థానిక ఎంపీపీ కార్యాలయంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు మాట్లాడుతూ వైద్యం కోసం పీహెచ్‌సీ(ప్రాథమిక ఆరోగ్య కేంద్రం)కి వచ్చే రోగులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతకుముందు ఆస్పత్రి అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎస్.మంజు, గోళ్లవలస సర్పంచ్ డి.దాలినాయుడు, ఎంపీడీవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్పయాత్ర

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మొబైల్ వాహనం ద్వారా వచ్చిన సిబ్బంది కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం వైద్యశిబిరం ఏర్పాటు చేసి, రోగులకు ఆరోగ్య తనిఖీలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో రేగిడి పీహెచ్‌సీ సిబ్బంది, సర్పంచ్ బుడుమూరు పట్టాభి, ఎంపీటీసీ మజ్జి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

25 మద్యంసీసాల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యంసీసాలను చూపిస్తున్న పోలీసులు

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న 25 మద్యంసీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ శ్రీనివాసరావు శనివారం తెలిపారు. ఎక్కడైనా అనుమతులు లేకుండా మద్యం విక్రయాలు చేసినా, మద్యంసీసాల తరలింపు చేపట్టినా చర్యలు తీసుకుంటామన్నారు.

రాజాం సిటీ: పట్టణ పరిధిలోని కొండంపేట రోడ్డు జంక్షన్ వద్ద అక్రమంగా తరలిస్తున్న 18 మద్యంసీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ వై.రవికిరణ్ తెలిపారు.

కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా

రాజాం సిటీ: పట్టణవాసులకు ఇబ్బంది లేకుండా కుళాయిల ద్వారా తాగునీటి సరఫరా చేపడుతున్నామని మున్సిపల్ కమిషనర్ ఎంవీ నాగరాజు తెలిపారు. శనివారం బొబ్బిలి రోడ్డులోని తాగునీటి సరఫరా కేంద్రాన్ని పరిశీలించిన ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం స్థానిక అమ్మవారి కాలనీలో కుళాయిల ద్వారా జరుగుతున్న తాగునీటి పంపింగ్‌ను గమనించారు. ప్రస్తుతం సిబ్బంది సమ్మెలో ఉన్న కారణంగా రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేసేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామన్నారు.

వైఎస్సార్ సీపీ నూతన కార్యాలయం ప్రారంభం



పూజలు చేసి, కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ తలే రాజేష్ దంపతులు

రాజాం: పట్టణంలోని పాలకొండ రోడ్డులో వైఎస్సార్ సీపీ నూతన కార్యాలయాన్ని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ శనివారం ప్రారంభించారు. ప్రజలకు సేవ చేసే భాగ్యాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారని, ఇకనుంచి ఇదే కార్యాలయంలో నిత్యం అందుబాటులో ఉంటామన్నారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పి.శ్రీనివాసరావు, రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల పార్టీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందజేత



దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందజేస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజేష్

రాజాం సిటీ: స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో పలువురు దివ్యాంగులకు ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్ చేతులమీదుగా ట్రై సైకిళ్లు శనివారం పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో పార్టీ టౌన్ కన్వీనర్ పి.శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, జెడ్పీటీసీ బి.నర్సింహులు పాల్గొన్నారు.



నాడు

గతంలో వర్షమొస్తే ఇదీ గాయత్రి డిగ్రీ కాలేజీ రోడ్డు పరిస్థితి



నేడు

అదే దారిలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిర్మించిన కొత్త రోడ్డు

అభివృద్ధిలో బొబ్బిలి టాప్..!

మూడు దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని బొబ్బిలి ఇప్పుడు ప్రగతిబాట పట్టింది. ఇదివరకు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన మున్సిపాలిటీ అభివృద్ధి కనిపించేది. అన్నిప్రాంతాల అభివృద్ధి, అన్నివర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తుండడంతో పట్టణంలో ప్రగతి పవనాలు వీస్తున్నాయి. ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు చొరవతో 14, 15వ ఆర్థికసంఘం నిధులు సహా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమ నిధులు మంజూరై, అభివృద్ధి పనులు చకచకా జరిగాయి. 30 ఏళ్ల తర్వాత ఒక్కసారిగా మున్సిపాలిటీ రూపురేఖలు మారడంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

- మూడు దశాబ్దాలుగా బొబ్బిలిలో కానరాని ప్రగతి
- వైఎస్సార్ సీపీ హయాంలో శరవేగంగా అభివృద్ధి
- 14, 15వ ఆర్థికసంఘం, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమ నిధులతో విస్తృతంగా పనులు
- రూ.24.93 కోట్లతో రహదారులు, సీసీ రోడ్లు, డ్రెయిన్లు, రోడ్ల విస్తరణ
- 30 ఏళ్లలో లేని మార్పు.. నాలుగున్నరేళ్లలో సాధ్యం కావడంపై సర్వత్రా హర్షం

14వ ఆర్థికసంఘం నిధులతో..

- మంజూరైన పనులు 233,
- మంజూరైన నిధులు రూ.13.84 కోట్లు
- పూర్తయిన పనులు 210,
- ఖర్చు చేసిన నిధులు రూ.11.70 కోట్లు

15వ ఆర్థికసంఘం నిధులతో..

- మంజూరైన పనులు 72,
- మంజూరైన నిధులు రూ.3.98 కోట్లు
- పూర్తయిన పనులు 06, ఖర్చు చేసిన
- నిధులు రూ.99 లక్షలు

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమ నిధులతో

- మంజూరైన పనులు 80,
- మంజూరైన నిధులు రూ.3.11 కోట్లు
- పూర్తయిన పనులు 42,
- ఖర్చు చేసిన నిధులు రూ.1.34 కోట్లు

టీడీపీ హయాంలో మధ్యలో వదిలేసిన ప్రధాన రహదారి విస్తరణకు ఖర్చు చేసినది రూ.4 కోట్లు



రూ.4 కోట్ల వ్యయంతో కొత్తగా నిర్మించిన పట్టణ ప్రధాన రోడ్డు

బొబ్బిలి: పట్టణంలో గడిచిన ముప్పై ఏళ్లలో జరగని అభివృద్ధి, వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లలో జరగడంపై పట్టణవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రప్రథమ మున్సిపల్ చైర్మన్ ఆరి గంగయ్య 30 ఏళ్ల క్రితం వేసిన రోడ్డే నిన్నమొన్నటి వరకు గుంతలు పడి, అధ్వానంగా ఉన్నాయంటే ఎన్నాళ్లుగా బొబ్బిలి మున్సిపాలిటీ నిర్లక్ష్యానికి గురైందన్న విషయం అర్థమవుతోంది. ప్రధానంగా అభివృద్ధి, సంక్షేమంపై దృష్టిసారించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యుద్ధప్రాతిపదికన అభివృద్ధి పనులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవడంతో పట్టణంలో అభివృద్ధి పనులు చకచకా జరిగాయి. కొత్తగా ప్రధాన రహదారులు, సీసీ రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టులు నిర్మాణం చేపట్టి, మూడు దశాబ్దాలుగా ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను దూరం చేశారు. 31 వార్డుల్లోనూ ఇప్పుడు ప్రగతి పనులు జరుగుతుండడం గమనార్హం. ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత శంబంగి వేణుగోపాలనాయుడు, వార్డు కౌన్సిలర్లంతా కలిసి, ప్రాధాన్యతా క్రమంలో అత్యవసరమైన చోట అభివృద్ధి పనులు జరిగేలా చొరవ తీసుకుంటున్నారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, డీఈఈ రవికుమార్, ఏఈ సురేష్‌లతో మాట్లాడి, పనుల ప్రతిపాదనలు చేయించారు. ఆ వెంటనే టెండర్లకు పిలిచి, పనులు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. ప్రతీ వార్డులో అభివృద్ధికి రూ.10 లక్షలు కేటాయించారు. వీటితో మౌలిక సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటివరకు 31 వార్డుల్లో రూ.14.03 కోట్లతో అభివృద్ధి పనులను అధికార యంత్రాంగం పూర్తి చేసింది. టెండర్ల దశలో రూ.15.90 కోట్ల విలువైన పనులుండగా, ఆ పనులు కూడా త్వరితగతిన జరిగేలా ప్రజాప్రతినిధులు, అధికారులు ఎప్పటికప్పుడు సమావేశాలు, సమీక్షలు నిర్వహిస్తూ చర్యలు తీసుకుంటున్నారు.



నాడు

గతంలో నాయుడుకాలనీ జంక్షన్‌లోని మట్టిరోడ్డు



నేడు

అదే జంక్షన్‌లో జగనన్న ప్రభుత్వం వేసిన సీసీ రోడ్డు

గతంలో భూమిపూజకే పరిమితం..



గతంలో బొబ్బిలిలో అభివృద్ధి పనులంటే భూమిపూజకే పరిమితం. ప్రజలను నమ్మించేందుకు కొబ్బరికాయ కొట్టి, పనులు ప్రారంభిస్తున్నట్లు 'షో' ఇచ్చేవారు. ఇప్పుడు మాత్రం కొబ్బరికాయ కొట్టారంటే వెంటనే పని జరగాల్సిందే.

ఎస్వీ మురళీకృష్ణారావు,
మున్సిపల్ చైర్మన్, బొబ్బిలి మున్సిపాలిటీ.

త్వరితగతిన పనులు పూర్తి చేశాం..



రోడ్ల నిర్మాణాలకు ముందుకు వచ్చిన వారితో పలుమార్లు సమావేశాలు నిర్వహించాం. నిధుల సమస్య ఉండదని హామీ ఇచ్చి మరీ పనులు త్వరితగతిన పూర్తి చేయించాం. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజల సహకారంతో అభివృద్ధి శరవేగంగా జరుగుతోంది.

– ఎస్ శ్రీనివాసరావు,
మున్సిపల్ కమిషనర్, బొబ్బిలి మున్సిపాలిటీ.



చాలా ఏళ్ల తర్వాత పెద్దబజారులో వేసిన కొత్త రోడ్డు

చెప్పామంటే.. చేస్తామంతే..



అభివృద్ధి, సంక్షేమం విషయంలో తమ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి గానీ తాము గానీ చెప్పామంటే.. చేస్తామంతే. మాట తప్పని, మడమ తిప్పని నేతగా మా నాయకుడు జగనన్న పేరొందారన్నారు. బొబ్బిలి అభివృద్ధికి చాలా నిధులు కేటాయించారు. రోడ్ల విస్తరణతో పాటు కొత్తగా తారురోడ్లు, సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు నిర్మించడం జరిగింది. కాలేజీ, పూల్‌బాగ్ బీటీ రోడ్లను త్వరలోనే పూర్తి చేస్తాం. ఆ తర్వాత బజారు రోడ్డు ప్రతిపాదనను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తాం.

– శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, ఎమ్మెల్యే, బొబ్బిలి.

వైఎస్సార్ సీపీతోనే సంక్షేమాభివృద్ధి

- అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



కొత్తగా నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

రామభద్రపురం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండల కేంద్రంలోని రెల్లివీధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిధులతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రెయిన్లు, రక్షిత మంచినీటి పథకం ట్యాంకును ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, బొబ్బిలి పట్టణంలోని లబ్ధిదారులకు ఈ నాలుగున్నరేళ్లలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.1074.60 కోట్ల లబ్ధి జరిగిందన్నారు. అలాగే నాలుగు మండలాల్లోని 212 గ్రామాల్లో తాగునీటి సదుపాయానికి రూ.82.09 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. వీటిలో 107 గ్రామాలకు రూ.12.46 కోట్లు ఖర్చు చేసి, ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసి, తాగునీరు అందించడం జరిగిందన్నారు. మరో రూ.118.97 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం అనేకానేక సంక్షేమ పథకాలు అమలుచేయడం జరుగుతోందన్నారు. ప్రజలకు చేస్తున్న మంచిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా లేనిపోని ఆరోపణలతో ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. సంక్షేమ సారథి సీఎం జగన్ అని, ఆయననే మళ్లీ మళ్లీ ముఖ్యమంత్రిగా జనం కోరుకుంటున్నారన్నారు. రానున్న ఎన్నికల్లోనూ పార్టీ విజయం ఖాయమని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ సీహెచ్ లక్ష్మణరావు, పార్టీ మండల అధ్యక్షుడు ఎ.లక్ష్మీనాయుడు, మండల జేసీఎస్ కన్వీనర్ సీహెచ్ సింహాచలంనాయుడు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా హరిబాబు



రాజాం సిటీ: స్థానిక ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా చిన్నపిల్లల వైద్యనిపుణుడు కరణం హరిబాబు నియమితులయ్యారు. ఇక్కడ సూపరింటెండెంట్‌గా పనిచేసిన జి.వి.రాజ్యలక్ష్మిని శ్రీకాకుళం డీసీహెచ్‌ఎస్‌గా పదోన్నతిపై బదిలీ అయ్యారు.

ఆర్‌టీసీ కాంప్లెక్స్ నిర్మాణ పనులపై ఆరా



కాంప్లెక్స్ నిర్మాణ పనుల పరిశీలనలో తలే రాజేష్

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్ ఆవరణలో రూ.కోటి వ్యయంతో నిర్మిస్తున్న ఆర్‌టీసీ కాంప్లెక్స్ నిర్మాణ పనులపై వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ ఆరాతీశారు. శనివారం పనులను పరిశీలించిన ఆయన త్వరితగతిన పనులు పూర్తిచేయాలని కాంట్రాక్టర్ రామారావును ఆదేశించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ పి.శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ నాగరాజు తదితరులు ఉన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి

బొబ్బిలి: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని డిప్యూటీ డీఈవో పి.బ్రహ్మాజీరావు అన్నారు. మండలంలోని పెంట గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాలను శనివారం సందర్శించిన ఆయన విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సదుపాయాలు సక్రమంగా వారికి అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం విద్యార్థుల విద్యాసామర్థ్యాలు, ఉపాధ్యాయుల బోధన, విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించి, పలు సూచనలు చేశారు.

పండగలా పింఛన్ల పంపిణీ



రామభద్రపురం: ఎమ్మెల్యే శంబంగి సమక్షంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు

బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో సామాజిక పింఛన్ల పంపిణీ పండగలా జరుగుతోంది. శనివారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధుల చేతులమీదుగా లబ్ధిదారులకు పెన్షన్ నగదు అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పింఛన్‌దారులకు ఈ నెల నుంచి నెలకు రూ.3 వేలు చొప్పున అందిస్తుండడంతో ప్రభుత్వంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

– సాక్షి నెట్‌వర్క్.



తెర్లాం: ఎం.ఆర్.అగ్రహారంలో పింఛన్లు అందిస్తున్న పార్టీ మండల అధ్యక్షుడు సత్యంనాయుడు



రాజాం: గడిముడిదాంలో కొత్త పింఛన్లు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ విక్రాంత్



బాడంగి: రేజేరులో పార్టీ మండల అధ్యక్షుడు వెంకటనాయుడు సమక్షంలో పింఛన్ల పంపిణీ



రేగిడి: వండానపేటలో కొత్త పింఛన్ల పంపిణీ



తెర్లాం: విజయరాంపురంలో పింఛన్ నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి, ఎంపీపీ ఉమాలక్ష్మి

సీఎం జగన్‌తోనే గ్రామాల అభివృద్ధి

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



తెర్లాం: విజయరాంపురంలో ఇంటింటికీ ఏర్పాటు చేసిన తాగునీటి కుళాయిలు ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే శంబంగి



రాజాం: గడిముడిదాంలో సచివాలయం ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ విక్రాంత్, తలే రాజేష్

తెర్లాం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని విజయరాంపురం సచివాలయం పరిధిలో రూ.35 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం నిర్మాణాలతో పాటు జల్ జీవన్ మిషన్ పనులను ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడుతో కలిసి జెడ్పీ చైర్మన్ శనివారం ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ బి.మధుసూదనరావు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో పాల్గొని, జెడ్పీ చైర్మన్ మాట్లాడారు. రాష్ట్రంలో సుపరిపాలనకు అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం జగనన్న తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమన్నారు. ఈ వ్యవస్థ గ్రామంలోనే ప్రభుత్వ సేవలు అందుతున్నాయన్నారు. ఇప్పుడు గ్రామాల్లో ఉన్న వెల్‌నెస్ సెంటర్‌ల ద్వారా ఆరోగ్యసేవలు, ఆర్‌బీకేల ద్వారా రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు, సచివాలయాల ద్వారా ప్రభుత్వ సేవలు అందుతున్నాయన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని ప్రతీ హామీని నెరవేర్చడంతో పాటు రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారన్నారు. ఇప్పుడు ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్‌ను రూ.3 వేలకు పెంచి, ఇస్తున్నారన్నారు. ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ విజయరాంపురంలో రూ.25 లక్షలతో సచివాలయ భవనం, రూ.23.94 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.6.6 లక్షలతో జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ కుళాయిలు నిర్మించడం జరిగిందన్నారు. వైఎస్సార్ సీపీ పాలనతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. రానున్న ఎన్నికల్లోనూ మళ్లీ జనమంతా జగనన్నను ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎస్.ఉమాలక్ష్మి, వైస్ ఎంపీపీ సీహెచ్ సత్యనారాయణ, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు టి.సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాజాం: మండలంలోని గడిముడిదాం గ్రామంలో రూ.43 లక్షల వ్యయంతో కొత్తగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చేతులమీదుగా శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమం సాధ్యమని, ఇదే సుపరిపాలన కావాలంటే రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీనే మళ్లీ గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్, జెడ్పీ వైస్ చైర్మన్ ఎస్.జగన్మోహనరావు, ఎంపీపీ ఎల్.సులోచన తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి మండల స్థాయి పోటీలు

రాజాం: మండలంలో ఈ నెల 10వ తేదీ నుంచి మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు నిర్వహించడం జరుగుతుందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. స్థానిక పట్టణ పరిధిలో నిర్వహించిన గ్రామసచివాలయ స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల ముగింపు కార్యక్రమం జీసీఎస్‌ఆర్ కళాశాల మైదానంలో శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా క్రికెట్ టీమ్ ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించి, కాసేపు మాట్లాడారు. గెలుపోటములను సమానంగా తీసుకోవాలని, అందరూ క్రీడల్లో రాణించాలని కోరారు. అనంతరం క్రీడాకారులకు జెర్సీలు(క్రీడాదుస్తులు) అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పి.శ్రీనివాసరావు, పార్టీ నేతలు టి.తిరుమలరావు, పి.శ్యామలరావు, పి.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. గోళ్లవలసకు, ఎమ్.ఆర్.అగ్రహారం జట్ల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో ఎమ్.ఆర్.అగ్రహారం జట్టు విజయం సాధించింది. కార్యక్రమంలో గోళ్లవలస సర్పంచ్ డి.దాలినాయుడు, ఎంపీడీవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజాం సిటీ: ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల్లో భాగంగా మండలంలోని బొద్దాంలో కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు వైస్ ఎంపీపీ నక్క వర్షిణి చేతులమీదుగా జెర్సీలు(క్రీడాదుస్తులు) పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాసూరి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

వంగర: మండలంలోని అరసాడ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక శనివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా పి.శ్రీకర్, ఉపాధ్యక్షులుగా ఎం.గోవిందరావు, జి.వాసుదేవరావు, పి.యశోద, అప్పన్నదొర, ఎస్.శ్రీనివాసరావు, జి.ఠాగూర్, మండల కార్యదర్శులుగా ఎన్.లీల, బి.బాలమోహన్, పాగిరి మోహనరావు, సీహెచ్.మురళీధర్, వై.గోవిందరావు ఎన్నికయ్యారు.